# గృహస్థాశ్రమం

ఇల్లు కట్టడం డామ్ యీఝీవోయ్ అంటారు మావారు.
కట్టండి చూద్దాం అని మనం అంటె అ వెధవ సామెత ఒకటి అడ్డొ
స్తోందోయ్ అంటారు తప్పంతా సామెతదైనట్లూ మనంరడీగానే వున్నట్టు.
మనం పైన ఇల్లు కట్టుకోవాలంటే కింద జాగా వుండాలా వద్దా? అద్దెం
వినిపించుకోరు మా గురుగారు. మేం ఇల్లు కట్టడం గురించి ఆలోచించి
నప్పుడల్లా జాగా విషయం మర్చిపోతూ వుంటాం. అఫ్టరాల్ యిల్లు కట్టా
లనే సంకల్పమే వుండాలిగాని జాగా వుంటేనేం లేకపోతేనేం? ఫస్ట్ సంక
ల్పం, మనో నిబ్బరం, గుండె దిటవు కావాలంటారు. ఇల్లు కట్టుకోక
పోవటం వలన మాకు చాలా హారిబుల్‌గా వుంటో వుంటుంది అప్పు
డప్పుడు. ఓ గోడని మేకు కొట్టుకోవాలని వుంటుందా వుండదా మీరే
చెప్పండి. మనకి గోడలకి సున్నాలు వేయించాలి. అని మనసు పుట్టినపుడు
ఎవరి గోడలకు సున్నాలు వేస్తాం చెప్పండి. సున్నాలు వెయ్యాలంటే
మనకి గోడలుండాలా అక్కర్లేదా? మనకి ఇల్లు అద్దెకివ్వాలనుంటుంది.
అద్దె పెంచాలని వుంటుంది. ఓయిల్లు కట్టుకోకుండా అసరదా ఎలా తీరు
తుంది? దొడ్లో ఇసకపోయించాలనిపిస్తుంది. ఇసుక పోయిద్దా వంటే
యిల్లూ దొడ్డీ వుండాలా అక్కర్లేదా? ఓ తాకట్టు పెట్టాలనా౨ అమ్మాలనా౨
ముందు ఇల్లు వుండాలా అక్కర్లేదా— కొందరంటారు ఇల్లు కట్టుకోవాలనే
కోరిక కలగటం పరమ షూలిష్టని. అద్దె కొంపల్లో వుంటం నాగరికతా

ఇల్లు కట్టుకోవటం బార్బరస్సుట. పక్కింటి పాపాయిని ముద్దెట్టుకుని సంతోషించటం మంచిదా, మనవే అవరోన్ ప్రాడక్ట్ (ఇది మా స్వంత తయారీ) అని పాపాయికోసం పాపం చేయటం మంచిదా? ఇల్లు కట్టుకోవటం పుణ్యమో పాపమో అదలాగుణ్ణిండికాని మనం ఇల్లుకట్టుకోకపోతే మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరుండదు. మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరులేకపోయాక మనకెంత దిగులుగా వుంటుంది? బిల్లుకలక్టరు శుభలేఖలు పట్టుకొచ్చినట్లు నోటీసులు పట్టుకొచ్చి యివ్వటం ఇంటిపన్ను ఎప్పుడుకడతారా అని అడగటం కడతాంలేవోయ్ అని మనం అనటం వాడువెళ్లి మరి నలుగురిని వెంటేసుకు రావటం యిలాంటి చిల్లర



సరదాలు మనకి ఇల్లులేకపోతే మన జన్మలో తీరవు. మనింట్లో దొంగలు పడ్డారనుకోండి. ఫలానా వారింట్లో పడ్డారని చెప్పకుండా ఫలానా వారింట్లో అద్దెకుంటున్న వారింట్లో దొంగలు పడ్డారని అంతా చెప్పుకుంటారు. ఇటు దొంగలకీ, అటు దొంగలు కానివారికీ కూడా మనం లోకువే.

ఇలా పోరగా పోరగా ఒక రోజున మావారు వెళ్ళి ఇంటివాడితో మేం ఇల్లు కట్టుకుంటున్నావండీ అని చెప్పారు. ఎక్కడెక్కడా అని వాడు కుర్చీలోంచి దేవబోయి లేవలేక మావార్ని కూడా ఒక కుర్చీలో కూచోండి కూచోండ్సార్ కూచోండన్నాడు. కట్టబోయే యిల్లు గురించి

మావారు చిన్న లెక్చరిస్తూండగా వారు ఎక్కడెక్కడ అని అడుగుతోనే వున్నాడు. అంగుళం మందం గోడలూ, అరంగుళం మందం పై కప్పు తుఫానులో కూడా మిగతా యిళ్ళన్నీ వచ్చి దీనిమీద పడాల్సిందేకాని యిదెక్కడికి పోదన్నారు. నేల గచ్చు చేయించం. మాకుకావలసిన ఆహారాన్ని అక్కడే పండించుకుంటాం అని గ్రీన్ రివల్యూషన్ గురించి కూడా అప్పుడే మాట్లాడేశారు. మావారు వ్యావసాయిక విప్లవాన్ని గృహ నిర్మాణ పథకాన్ని కలగా పులగంచేసేస్తున్నారని గ్రహించిననేను అమ్మ అప్పచ్చి చేసింది తిండానికి రమ్మనిచెప్పని మాచంటిని పంపించా. అది తిన్నగా హౌవుస్ వోనర్ మరియు ల్యాండ్‌లార్డ్‌ని అప్పచ్చి పెట్టమని ముందు అడిగి తరువాత పీడించసాగింది. నేనేమీ అప్పచ్చిలు వండలేదే తల్లీ అని ఆ యిల్లు గల ఆసామీ కంగారు పడిపోసాగాడు. ఏమండీ మీరు వంట బాగా చేస్తారని ఎవరో చెప్పగా ఎక్కడో విన్నానండీ అని మావారు మాచంటిని ఎత్తుకుని నీకు అమ్మ నడిగి అప్పచ్చిపెట్టిస్తాను రాఅని తీసుకొచ్చేశారు. "వ్హాట్, అప్పచ్చంటుం దేవిటి? దీని లాంగ్వేజీ బోధ పడకుండా వుంది" అన్నారు. అటుకులు తొక్కానులెండి బెల్లంవేసి నాలు కొబ్బరి ముక్కలు పడేసి— అది పెట్టమంటూంది అన్నాన్నేను. తొక్కడవేమిటి కాలేసి తొక్కినట్లు.... తినె వస్తువుకు ఏదైనాలవ్లీగా, రొమాంటింక్‌గా స్టయిలిష్‌గావుండే పేర్లుపెట్టి చెప్పాలిగాని కాల్చాను అంటూ బ్రూట్‌లా మాట్లాడకు అని కోంపడ్డారు. తొక్కుడు పచ్చడి తొక్కుడు లడ్డూ మీ కిష్టవేగదా (అంటే) ఆఫ్‌కోర్స్ అన్నారు "కాని నీ చెప్పటం అనాలిసిన్ బావులేదే పిల్లా" అన్నారు మళ్ళీ. బండపెట్టి నూరేతే బండపచ్చడి వస్తుంది— అది మీకిష్టమేకదా (అఫ్‌కోర్స్) మరి దానికేం చెప్తారు? "బండ పచ్చడికి రేపట్నుంచి మనోరమ అని పేరెట్టు. తొక్కుడు పచ్చడికి మమత అనిపెట్టు వేపుళ్ళన్నిటికి నీలిమ అను. గోంగూరకి కాళిమఅను దొసకాయపప్పుకి సుజాత అను. ఒడియాలకు అరుణ కిరణాలను. యిలాగే కవులు తమ స్వంత సంకేతాలను వాడినట్లు సుకుమారమైనలవ్లీ శబ్దాలను పేర్చుకుంటూపో (అవున్లెండి- వంటెలా తగులబడితె మీకెందుకు) తొక్కుడు లడ్డూని మధురిమ అంటేపోలే—"

అప్పుడు కట్ చేసి మన ఇంటికి ఏం పేరు పెట్టుకుందావండీ అన డిగాను ఒరిజినల్ సబ్జెక్ట్ వైపు లాగుతూ, పూరిల్లువేస్తే పూరింటివార్ అందాము. మేడవేస్తే మేడ్వార్ అందాం. డాబావేస్తే డాబాల్వార్ అవుతాము. మనం అవుతాం సరేలెండి, మనిల్లు ఏవిటవుతుంది? ఇల్లు ఏమీ అవదు— వున్నన్నాళ్ళు వుంటుంది మనతో, లేకపోతే పోయేకాల్మొస్తే పోతుంది.

ఇలా యిల్లు కట్టడం గురించి మేము చాలా చాలా సార్లు ఆలోచించాం యాభై వేల రూపాయలెట్టి సపోజ్ మనం యిల్లు కడితె మన కాపిటల్ బ్లాకయి పోతుంది. 50వేల మీద నూటికి ఏడురూపాయలు వడ్డీవేసుకున్నా ఏడాదికి మూడువేల ఐదువందలు. సుమారు నెలకు మూడువందల రూపాయలలోపు ఆదాయం వస్తుంది. ఆదిల్లు కట్టేస్తే నెలకు మూడొందలు అద్దెవస్తుందా? రాదు ఎలక్ట్రిక్ బిల్లులు ఇళ్ళ పన్నులు నోటీసులు వస్తాయి. మనం ఆ యింట్లోవుంటే ఆ అద్దెరాదు. పైగా సున్నాలు, బాగోగులు మెయింటెనెన్స్—ఈ న్యూసెన్సంతా ఆలోచించి మనకి ఇల్లు వద్దంటీ అన్నానేను. అద్దె కొంపలోవున్న సుఖం సొంత యింట్లో ఎలా వస్తుంది? అద్దెయింట్లో ఎలామనకు పన్నులు పీకవు. ఆదొహాయి— స్వంత యింటిమీద మనకు లాభం రావాలంటే యిల్లంతా అద్దెకిచ్చేసి మనం వేరే అద్దెయింట్లో వుండాలి. ఇల్లు కట్టెయ్యగానే సరదా తీరిపోతుందికదా—

వెంటనే దాన్ని అమ్మెవెయ్యాలి. అప్పుడుగాని ప్రాణం హాయిగా వుండదు. మేం ఇల్లు కట్టే ప్రోగ్రాం వాయిదా వేశాం—దానివలన మాని యాభై వేలమీద నెలకు మూడు వందల రూపాయలు చొప్పున లాభం వస్తోంది. ఇప్పుడు మేం నూట యాభై రూపాయలు అద్దెయిస్తున్నాం— ఇవ్వగా మాకు నూటయాభై మిగుల్తొంది. (అఫ్‌కోర్స్ మా దగ్గర యాభై వేల రూపాయల్లేవనుకోండి. వుంటే నూటయాభై చొప్పున మిగిలేవి) మేము లక్ష రూపాయలతో యిల్లు కట్టకుండా వుంటే మాకు నెలకు ఆరు

వందలు అదా అవుతుంది. మీరైనా అంతే లక్ష రూపాయలుంటే యిల్లు కట్టకండి, మేం అందుకే యిల్లు కట్టడం మానుకున్నాం. మా కిప్పుడు ఇంటి పన్ను పెంచుతారనే బెంగాలేదు, నోటీసు లొస్తాయనే భయమూ లేదు. ఇంట్లో అద్దెకొచ్చేవాళ్లు ఎలాటి పెంకెఘటాలోఅన్న అనుమానమూ లేదు. సొంత యింట్లో మేకు కొడుతూంటే మన గుండెల్లో దిగినట్లుగా వుంటుంది. అద్దె యింట్లో గోడకి మేకు కొడుతూంటే పక్కవాడి గుండెల్లో మేకు దిగుతున్నట్లుగా వుంటుంది. పక్కవాడి గుండెల్లో మేకు దిగితే మనకేం?